క్లుప్తంగా

పంద్రాగస్ట్ వేడుకలకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధికారిక హోదాలో ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా పోలీసు గౌరవ వందనం స్వీకరణ, జిల్లా ప్రగతిపై ప్రసంగం చేయనున్నారు. అనంతరం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతిభాపాటవాలు కనబరిచిన ఉద్యోగ సిబ్బందికి ప్రశంస పత్రాలను అందజేయనున్నారు.

26న ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్: సేవా కార్యక్రమాల ద్వారా మదర్ థెరిస్సా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఈనెల 26న మదర్‌థెరిస్సా 113వ జయంతిని పురస్కరించుకుని నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పకు చెందిన మదర్‌థెరిస్సా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఆదివారం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను కలిసి జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింగరావు, పితాని శ్రీనివాసరావు, దాలినాయుడు, పల్లె శ్రీనివాసరావు, నాగభూషణం, అద్దంకి శ్రీనివాసరావు, పోతుల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శివ, బుజ్జీ, మూర్తి తదితరులు ఉన్నారు.

తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తిపై కేసు నమోదు



నిందితుడు సర్ఫరాజ్

సుభాష్‌నగర్: దొంగతనం విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చి విచారణను తప్పుదోవ పట్టించిన వ్యక్తిపై సూరారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం కైసర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సర్ఫరాజ్ తన ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు రూ.20లక్షలు ఎత్తుకెళ్లారని ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన సూరారం పోలీసులు అంత డబ్బు నీకు ఎక్కడ నుంచి వచ్చిందో వివరాలు సమర్పించాలన్నారు. దీంతో మాటమార్చిన సదరు వ్యక్తి తన భార్య పర్సులో ఉంచిన రూ.3,500 మాత్రమే చోరీకి గురయ్యాయని ఒప్పుకున్నాడు. కేసు నమోదు విషయంలో పోలీసులను తప్పుదోవ పట్టించిన సర్ఫరాజ్‌పై ఐపీసీ సెక్షన్ 454, 380ల కింద కేసు నమోదు చేశారు.

నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

జగద్గిరిగుట్ట: డివిజన్ ఫరిదితోని అంజయ్యనగర్‌లో ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచకపోవడంతో కలిగే నష్టాల గురించి జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లో, ఇంటి బయట నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీటి ద్వారా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

డివిజన్‌ను అభివృద్ధి చేయడమే ధ్యేయం

చింతల్: డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని చింతల్ కార్పొరేటర్ రషీదాబేగం అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ కాలనీలో రూ. 49.80 లక్షల నిధులతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రషీదా మాట్లాడుతూ.. హెచ్ఎంటీ పరిశ్రమ ఎస్టేట్ డిపార్ట్‌మెంట్, కాలనీ అసోసియేషన్, వాకర్ల విజ్ఞప్తిపై కొత్త రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయించామన్నారు. మొదట విడతగా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ నుంచి హెచ్ఎంటీ ఆడిటోరియం వరకు రోడ్డు వేస్తున్నామని తెలిపారు. రెండో విడతలో హెచ్ఎంటీ సబ్‌స్టేషన్ వరకు రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. వాటిని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఏఈ సంపత్, రామచందర్, శ్రీశైలం, బీడీవీ ప్రసాద్, నరేందర్ కాశి, సూర్యప్రభ తదితరులు ఉన్నారు.

కార్పొరేటర్‌కు సన్మానం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో ఎటువంటి సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. సోమయ్యనగర్‌లో రోడ్ నం.5లో తీవ్రమైన నీటి సమస్య ఉండేది. కాగా ఇటీవలే కొత్త పైప్‌లైన్ పనులు ప్రారంభించారు.కాగా ఈ పనులు పూర్తి అవ్వడంతో సోమయ్యనగర్ బస్తీవాసులు కార్పొరేటర్ జగన్‌ను ఆదివారం ఘనంగా సన్మానించా. ఎన్నో ఏళ్లుగా ఉన్న నీటి సమస్య తీరడంతో తమకు సంతోషంగా ఉందన్నారు.

దుమ్ము.. ధూళి
తొలగించడంలో నిర్లక్ష్యం

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పనులు చేయకున్నా స్వీపింగ్ మెషిన్ల ఏజెన్సీకి బిల్లులు



సర్కిల్ కార్యాలయం వద్ద ఉంచిన స్వీపింగ్ వాహనం

రంగారెడ్డినగర్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నగర రహదారులను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వీపింగ్ మెషిన్లను నడుపుతున్నా, సదరు ప్రైవేట్ ఏజెన్సీల నిర్వాకంతో రోడ్ల వెంబడి డివైడర్ల వద్ద దుమ్ము ధూళి పేరుకుపోతోంది.. ప్రతి ఏడాది స్వీపింగ్ మెషిన్ల నిర్వహణకు జీహెచ్ఎంసీ కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా వాహనదారుల కళ్లల్లో దుమ్ము, ధూళి పడకుండా సురక్షితంగా రాకపోకలు సాగించడం సాధ్య పడపడటం లేదు. అయితే ప్రతి నెలా ఏజెన్సీలకు తుచా తప్పకుండా బిల్లులు చెల్లిస్తుండటం గమనార్హం.

◆ కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రోడ్లను శుభ్రం చేయడానికి వీలుగా స్వీపింగ్ మెషిన్ నిర్వహించేందుకు ఓ ప్రైవేట్ కంపెనీతో జీహెచ్ఎంసీ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు పది గంటల పాటు ఆయా ప్రధాన రోడ్లలో పేరుకుపోయిన దుమ్ము, ధూళిని శుభ్రం చేయాల్సి ఉంటుంది.

◆ అందుకు గాను ఏజెన్సీకి గంటకు రూ.1100 చొప్పున ఒక్కో స్వీపింగ్ మెషిన్‌కు నెలకు రూ.3 లక్షల 3వేల రూపాయలు, ఏడాదికి రూ.39 లక్షలు 60వేల రూపాయలు చెల్లిస్తోంది. అయితే సదరు ఏజెన్సీ డ్రైవర్లు కేవలం జీపీఎస్ సిస్టమ్‌ను ఆన్‌చేసి వాహనాలను తిప్పుతూ కేవలం డివైడర్లను ఆనుకుని ఉన్న రోడ్లను మాత్రమే శుభ్రం చేస్తూ మిగతా రోడ్లను వదిలేస్తున్నాయి. అంతే కాకుండా కేవలం మూడు, నాలుగు గంటలు మాత్రమే స్వీపింగ్ మెషిన్లను తిప్పుతు ఆపై సర్కిల్ కార్యాలయం వద్ద నిలుపుతున్నారు.

◆ స్వీపింగ్ మెషిన్ ప్రతిరోజు 30- 40 కిలో మీటర్ల మేర శుభ్రం చేయాల్సి ఉంటుంది. కాని ఏజెన్సీల నిర్వాహకులు కేవలం 8 కిలోమీటర్లు సైతం శుభ్రం చేయని పరిస్థితి నెలకొంటోంది. కేవలం సర్కిల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న జంక్షన్‌కు అటు, ఇటుగా శుభ్రం చేస్తూ వస్తున్నారు.



షాపూర్‌నగర్ చౌరస్తాలోని సిగ్నల్స్ వద్ద..



ఐడీపీఎల్ చౌరస్తాలో పేరుకుపోయిన దుమ్ము..

దీంతో యంత్ర నిర్వహణకు ప్రతి నెలా లక్షలాది రూపాయాలు వెచ్చిస్తున్నా జంట సర్కిళ్ల పరిధిలో ఇతర ప్రధాన రోడ్లు దుమ్ము, ధూళితో కనిపిస్తున్నాయి. దీంతో వాహనదారుల రాకపోకల సమయంలో దుమ్ము లేవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

◆ స్వీపింగ్ మెషిన్ల ద్వారా నిర్వహిస్తున్న రోడ్ల శుభ్రత పనులను డిప్యూటీ కమిషనర్లతో పాటు అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ (ఏఎంహెచ్ఓ) పర్యవేక్షించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నదే బహిరంగ రహస్యం.. దీంతో సదరు ఏజెన్సీకి పూర్తిస్థాయిలో పనులు చేపట్టకున్నా లక్షలాది రూపాయల బిల్లుల రూపంలో జీహెచ్ఎంసీ నిధులను ధారదత్తం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'బీఆర్ఎస్ పాలనలో బస్తీల రూపురేఖలు మారిపోయాయి'



ఎమ్మెల్యే వివేకానంద్‌కు చెక్కును అందజేస్తున్న గాంధీనగర్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ సభ్యులు

రంగారెడ్డినగర్: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో బస్తీల రూపురేఖలు మారిపోయాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని విజయనగర్‌కాలనీ, మారుతీనగర్‌లలో విజయ్‌శేఖర్‌గౌడ్‌తో కలిసి ఆయన పర్యటించారు.

◆ ఈ సందర్భంగా స్థానికంగా పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, మిగిలిన పనులను సైతం త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాలు ఐక్యమత్యంగా ఉంటూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సూచించారు.

◆ గాజులరామారం డివిజన్ పరిధిలోని మిధిలానగర్‌లో రూ.77 లక్షల నిధులతో చేపడుతున్న తాగునీటి వాటర్ ట్యాంక్, అంతర్గత సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అదే విధంగా రూ.2.80 లక్షలతో అభివృద్ధి చేయనున్న ఐదు పబ్లిక్ పార్కులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్ రాఘవేందర్‌రావు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్స్ రవీంద్రనాథ్ ఠాగూర్, డీఏ చౌదరి, ప్రవీణ్ పోతినేని, ఎంఏ సురేష్, చెంగల్ రాయుడు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్రా అశోక్ పాల్గొన్నారు.

◆ సామాజిక సేవా కార్యక్రమాల్లో పారిశ్రామికవేత్తలు పాలు పంచుకోవడం శుభ పరిణామమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాంధీనగర్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామిగౌడ్ గాంధీనగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసేందుకు ఆదివారం స్థానికంగా పర్యటించిన ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయశేఖర్‌రెడ్డిల చేతుల మీదుగా సంక్షేమ సంఘం నాయకుడు జల్దా లక్ష్మినాథ్‌కు రూ. లక్ష చెక్కును అందజేశారు. నాయకులు అబ్దుల్ ఖాదర్, ప్రధాన కార్యదర్శి మేకల ఎల్లయ్య, ఇండస్ట్రియల్ అసోసియేషన్ కార్యదర్శి రవీందర్, జగదీష్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, తిమ్మయ్య తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్లు

దుండిగల్: మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట 26వ వార్డులోని కేవీఆర్ వ్యాలీలో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు వైస్‌చైర్మన్ పద్మారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... అన్ని వార్డుల్లో వసతులు కల్పిస్తున్నామని అన్నారు. త్వరలోనే రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. అనంతరం స్థానికంగా పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మాదాసు వెంకటేశం, సాయిబాబా యాదవ్, నేతలు జీతయ్య, దర్శన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్ర, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అభినందనీయం

సుభాష్‌నగర్: సామాజిక సేవా కార్యక్రమాల్లో సంఘాలు పాలు పంచుకోవడం అభినందనీయమని సూరారం ఎస్ఐ నారాయణసింగ్ అన్నారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ జన్మదినం సందర్భంగా కండ్లకోయకు చెందిన సీఎంఆర్ హాస్పిటల్ సౌజన్యంతో సూరారం కాలనీ లూయిస్‌బ్రెయిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరానికి ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో కంటి వైద్యులు, జనరల్ ఫిజీషియన్‌లు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ... బ్రాహ్మణుల సేవలు అన్ని వర్గాల వారికి అందాలనే కృతనిశ్చయంతో పేదలు నివసించే బస్తీలలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో సీఎంఆర్ ఆస్పత్రి పీఆర్వో దుర్గాప్రసాద్, డాక్టర్ రియాజ్, సంఘం సలహాదారుడు సర్వేపల్లి రమేష్ కుమార్, గురజాడ రంగారావు, శ్రీధరాచార్యులు, కోటేశ్వరరావు, గడ్డం రుచిత రాంబాబు, లక్ష్మీ సంజీవరావు, సురేష్ శర్మ, కళాసాగర్, సూర్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

యువత కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతోంది

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి



పార్టీలో చేరిన వారితో నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: జీడిమెట్ల డివిజన్‌కు చెందిన సిద్ధార్థ, అఖిల్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే విధంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. యువత కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, నేతలు మహేశ్, బత్తుల చిరంజీవి, దయానంద్, సీతారాంరెడ్డి, మల్లారెడ్డి, పూర్ణచందర్, భాస్కర్, చైతన్యసాయి తదితరులు పాల్గొన్నారు.

◆ **అమరవీరుల కుటుంబాలకు రూ.25వేల పింఛన్ ఇస్తాం**

దుండిగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం, నెలకు రూ.25 వేలు పింఛన్ అందజేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పథకాలను ప్రవేశపెడతామన్నారు. కార్యక్రమంలో ఉదయ్, వి.రాఘవాచారి, రాజు, పాపయ్య, శ్రీకాంత్, ఎండీ సాబేర్ మిత్ర బృందం పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో కొలన్ హన్మంత్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కుత్బుల్లాపూర్ సబ్‌స్టేషన్ ఏఈ రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ గణేష్‌నగర్ ఫీడర్ పరిధిలోని చెరుకుపల్లికాలనీ, కల్పన సొసైటీ, పద్మానగర్ ఫేజ్-01, ఎన్టీఆర్‌నగర్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు...

◆ అదే విధంగా 11 కేవీ సూర్యనగర్ ఫీడర్ పరిధిలోని సూర్యానగర్, బాల్‌రెడ్డినగర్, రామిరెడ్డినగర్, పాపయ్యయాదవ్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఇండస్ట్రీ, హెచ్ఏఎల్ ఫీడర్ల పరిధిలో...

సుభాష్‌నగర్: రీకండక్టరింగ్ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తనున్నాయని గాజులరామారం సబ్‌స్టేషన్ ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మినీ ఇండస్ట్రీ ఫీడర్ పరిధిలోని ఆర్ఎంనగర్, వల్లభాయ్‌పటేల్‌నగర్, వివేకానందనగర్, శ్రీనివాసనగర్ కాలనీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు..

◆ హెచ్ఏఎల్ ఫీడర్ పరిధిలోని ఉషోదయ కాలనీ ఫేజ్-1, 2, ఇంద్రనగర్ కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నిజాంపేట్: చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రగతినగర్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ మిథిలానగర్ ఫీడర్ పరిధిలోని ఆర్‌కే లేఅవుట్, భాష్యం, బ్లూమ్స్ స్కూల్, మిథిలానగర్, నారాయణ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

◆ అదే విధంగా 11 కేవీ రాజీవ్‌గృహకల్ప ఫీడర్ పరిధిలోని వాసవీ లేఅవుట్, సాయినగర్ రోడ్డు, శ్రీలక్ష్మి లేఅవుట్, న్యూ విజేత సూపర్‌మార్కెట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

100 కుట్టు మెషిన్ల పంపిణీ

రంగారెడ్డినగర్: పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో స్వచ్ఛంద సంస్థ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నామని లామ్రా సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అహ్మద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ ఎస్ఆర్ ప్యాలెస్‌లో ఆదివారం లామ్రా సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో 100మందికి కుట్టు మెషిన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకులు ఫర్హానా, కరీమా, గౌసియా బేగం, శైలాజ్, మూసీనా, మణి, సమీర్ సల్మాన్, సహనాజ్, ఫిరోజ్, అఫ్రోజ్, ఫిరోజ్, శివ, ఖలీల్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీ నాదేశం.. నా మట్టి



కుత్బుల్లాపూర్: దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. 'మేరీ మాటి - మేరా దేశ్ (నా దేశం.. నా మట్టి)'కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెయ్యి ద్విచక్ర వాహనాలతో తిరంగా ర్యాలీని నిర్వహించారు. గాజులరామారంలోని బీజేపీ అసెంబ్లీ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీని శ్రీశైలంగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. వందేమాతరం, భారత్ మాతాకీ జై, జై హింద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. దారులన్నీ జాతీయ జెండాలతో నిండిపోయి, వందేమాతరం నినాదాలతో హోరెత్తాయి. గాజులరామారంలో ప్రారంభమైన ఈ యాత్ర షాపూర్‌నగర్, చింతల్, ఐడీపీఎల్, పద్మనగర్ రింగ్ రోడ్డు, సుచిత్ర, కొంపల్లి మీదుగా ఎస్ఎస్ఆర్ గార్డెన్ కొంపల్లి వరకు కొనసాగింది.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య సమరయోధులు, అమర జవాన్లు గౌరవించుకుందుకే ప్రధాని నరేంద్ర మోదీ 'మేరీ మాటి - మేరా దేశ్'కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. దేశభక్తిని చాటుకునేందుకు.. దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని స్మరించుకునేందుకే ఈ తిరంగా ర్యాలీని చేపట్టామని పేర్కొన్నారు. దేశ పౌరులందరూ దేశం కోసం బలిదానం చేసిన ప్రతి ఒక్కరిని స్మరించుకుని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూన శ్రీనివాస్‌గౌడ్, బుచ్చిరెడ్డి, ఆదిరెడ్డి రాజిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, బావిగడ్డ రవి, గరిగే శేఖర్‌ముదిరాజ్, శివాజీ రాజా, సరితారావు, సతీష్ సాగర్, సదానందం, పత్తి రఘుపతి, ఎర్వ వెంకటరమణ, పీసర కృష్ణారెడ్డి, గోనె మల్లారెడ్డి, మోతె శ్రీనివాస్‌యాదవ్, రాజేశ్వర్‌రావు, కంది శ్రీరాములు, దుర్యోధన్‌రావు, సాయినాథ్ నేత, రాజేష్ మిశ్రా, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మురికివాడల్లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం



ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజుకు వినతి పత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలోని అన్ని కాలనీలు మురికివాడ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి ప్రజలకు భరోసా ఇవ్వడమే తన లక్ష్యమని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి వెళ్లి పలు వినతి పత్రాలు అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి అధికారులకు ఫోన్లు చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

◆ అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ స్థలాలు, డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించే విషయంలో తన వంతు కృషి ఉంటుందని హామీ ఇచ్చారు.

◆ గాజులరామారం ప్రాంతంలో ఉన్న సమస్యలపై ఎమ్మెల్సీని కలిసి పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా తప్పకుండా పరిష్కారం చూపుతామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించాలని అభ్యర్థించారు. హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.



వైభవంగా బోనాల జాతర

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. బౌరంపేటలోని బంగారు మైసమ్మ దేవాలయం, మల్లంపేటలోని గడీల మైసమ్మ ఆలయాల వద్ద బోనాలను నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలను సమర్పించి ఒడి బియ్యం పోసి తమ కొర్కెలు తీర్చాలని వేడుకున్నారు. పలువురు తొట్టెలను సమర్పించారు.





శివసత్తుల నృత్యాలు..